రూ.11.16 కోట్లతో రోడ్లకు మరమ్మతులు : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 412 కిలోమీటర్ల ఆర్అండ్బీ రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.11.16 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఈ పనులు రెండు, మూడు రోజుల్లోపు మొదలు కావాలని ఆర్అండ్బీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్అండ్బీ రోడ్ల నిర్మాణంపై సంబంధిత శాఖ ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్షించారు. డిసెంబరు చివరి నాటికి మరమ్మతు పనులను పూర్తి చేసి గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వరకు ఉన్న రహదారిని టాప్ ప్రయారిటీగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఈఈ సురేష్బాబు, డీఈలు పాల్గొన్నారు.

ఆనందాలకేళి.. దీపావళి..



కర్నూలు ఎస్టీబీసీ కాలేజ్ గ్రౌండ్లో బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఆనందోత్సాహాల నడుమ కష్టాల చీకట్లు తొలగించి సుఖాల వెలుగులు ప్రసాదించాలని కోరుతూ ఉత్సాహంగా జరుపుకునే పండుగ దీపావళి. ఆనంద దీపాలను మదిలో వెలిగించుకొని సుఖసంతోషాల జీవితానికి స్వాగతం పలుకుతూ దీపావళిని ఎంతో సరదాగా జరుపుకుంటారు. ఇంటిని దీపాలతో అలంకరించి లక్ష్మీదేవికి స్వాగతం పలికి అష్ట ఐశ్వర్యాలు ఉండాలని కోరుకుంటూ భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగే దీపావళి. దీపాల వెలుగులతో నిండే దివాళికి ప్రజలు సిద్ధమయ్యారు. దీపావళి సంబరం అంబరాన్ని అంటేలా గురువారం పండుగ చేసుకునేందుకు జిల్లా వాసులు సమాయత్తమవుతున్నారు. వెలుగులు జిలుగుల మధ్య గ్రామాలు పట్టణ ప్రాంతాలు నిండిపోయాయి. ఇక గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో వెలసిన టపాసుల దుకాణాలు అక్కడక్కడ కొనుగోలుదారులతో కిక్కిరిస్తున్నాయి. ఆనందాల దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని పలువురు కోరారు. టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



'ధరా'జువ్వలు..!

బాలలకు ఆనందాన్ని ఇచ్చే బాణసంచా ధరలు మార్కెట్లో ఆకాశానికి అంటేశాయి. జీఎస్టీ రాకతో, వ్యాపారులు కొంత మేరకు ధరలు తగ్గిస్తున్నా, పూర్తిస్థాయిలో మాత్రం ధరలు దిగిరాలేదు. తమిళనాడు రాష్ట్రంలోని శివకాశీ నుంచి స్థానికంగా బాణసంచా లైసెన్సు కలిగిన వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఏటా పెరుగుతున్న ముడి సరుకు ధరలు, రవాణా ఖర్చులు బాణసంచా విక్రయదారులపై పడుతున్నాయి. అయినా స్వల్ప లాభాలను చూసుకొనే అమ్మకాలు చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. అప్పట్లో రూ.200 పెడితే సంచుల కొద్దీ టపాసులు వచ్చేవి. ఇప్పుడు రూ.2వేలు పెట్టినా చిన్న సంచి నిండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా
మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఓర్వకల్లు మండలం హుశేనాపురం గ్రామానికి చెందిన మల్లెల రాజశేఖర్ను ప్రభుత్వం ఎంపిక చేసింది. మల్లెల రాజశేఖర్ ప్రస్తుతం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలోనూ జడ్పీ చైర్మన్గా పనిచేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ చైర్మన్గా ఉంటూ జిల్లాలో ఎంతో అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల మన్ననలు పొందడమే కాకుండా ఆయన చేసిన అభివృద్ధి సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ బోర్డులో 24 మందిని సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో హుశేనాపురం గ్రామానికి చెందిన మల్లెల రాజశేఖర్ టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎన్నుకోవడంతో గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా

టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. శ్రీనివాసుడి సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. తనను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, అలాగే మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా. స్వామివారి సేవలో సాధారణ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా.

- మల్లెల రాజశేఖర్, టీటీడీ బోర్డు సభ్యుడు

ఉల్లి రైతుకు న్యాయం జరిగే దాకా పోరాటం

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ
- రోడ్డుపై బైఠాయించిన రైతులు
- స్తంభించిన వాహనాల రాకపోకలు



నిరసన తెలుపుతున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో పది రోజులుగా ఉల్లి రైతులు ఇబ్బంది పడుతున్నా అధికారులు న్యాయం చేయడం లేదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి నిరసన తెలియజేశారు. దీంతో బస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నాలుగో పట్టణ పోలీసులు స్పందించి వాహనాలను వివిధ మార్గాల్లో రాకపోకలకు అనుమతించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ రైతుల సమస్యను పరిష్కరించమంటే.. తమ గొంతు నొక్కే ప్రయత్నం చేయడం దారుణమని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కార్తీకమాసంలో ప్రత్యేక బస్సులు

కర్నూలు రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్‌హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నుంచి ప్రతి సోమవారం జిల్లాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలకు బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. యాగంటి, మహానంది, ఓంకారం, భోగే శ్వరం, కాల్వ బుగ్గ వెళ్లే భక్తులకు టూర్ ప్యాకేజీని ఏర్పాటు చేశామన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసుకు పెద్దలకు రూ.650, చిన్న పిల్లలకు రూ.400లు చార్జీలు నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోండి



కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నతల్లిపై కేసు వేసిన నీచ చరిత్ర జగన్మోహన్‌రెడ్డిదని ధ్వజమెత్తారు. దుర్మార్గుడైన జగన్‌కు మద్దతుగా వైవీ సుబ్బారెడ్డి, సాయిరెడ్డి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి విజయమ్మ ఆస్తిలో షర్మిలకు వాటా ఉందని, తండ్రి చెప్పాడని, మా కుటుంబ వ్యవహారాల్లో వైవీ. విజయసాయి జోక్యం ఎందుకని ప్రశ్నించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని, ప్రతి ఒక్కరు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

4న జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రాక

● ఉదయం ఎన్డీఏ నాయకులతో భేటీ ● సాయంత్రం డీడీఆర్‌సీ సమావేశానికి హాజరు



కర్నూలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులయ్యాక తొలిసారిగా నవంబరు 4న జిల్లాకు రానున్నారు. 3వ తేదిన పాలకొల్లు నుంచి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలదేరి 4వ తేదీ తెల్లవారు జామున 4 గంటలకు డోన్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 5 గంటలకు కర్నూలు స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 10:30 గంటలకు టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం 11 గంటలకు మౌర్యఇన్ హోటల్‌లో జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి నాయకుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు కలెక్టరేట్‌లో సునయన ఆడిటోరియంలో జరిగితే డీఆర్సీ సమావేశానికి హాజరవుతారు. అనంతరం రాత్రి 9 గంటలకు డోన్ రైల్వే స్టేషన్‌కు బయలుదేరి అక్కడి నుంచి విజయవాడకు బయలుదేరుతారు.

ఉదయం రాజకీయం.. సాయంత్రం అధికార సమీక్ష

ఒకే రోజు ఎన్డీఏ నాయకుల సమావేశం, జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం (డీడీఆర్‌సీ) పెట్టడం వల్ల వివిధ శాఖలపై పూర్తి స్థాయి సమీక్ష చేయడం సాధ్యమా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర నెలలు గడిచినా పలు నియోజకవర్గాల్లో పని చేసే కొందరు అధికారుల్లో వైసీపీ వాసన పోలేదు. పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సామాన్య కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో టీడీపీ ముఖ్య కార్యకర్తలు, మండల స్థాయి నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారు. టీడీపీలో విభేదాలు వల్ల పార్టీనే ప్రాణపథంగా భావించిన వైసీపీ అక్రమాలను ఎదురొడ్డిన కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక రోజంతా కూటమి నాయకులకే కేటాయించి నియోజకవర్గాల వారిగా సమీక్షించి నేతల మధ్య సమన్వయం చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది. అదే క్రమంలో ఒక రోజంతా శాఖల వారిగా జిల్లా అభివృద్ధిపై సమీక్షలు నిర్వహిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులే అంటున్నారు.

ఉల్లి రైతుకు న్యాయం చేయాల్సిందే

మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. ఉల్లి రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం నగరంలోని మార్కెట్ యార్డులో రోజుల తరబడి ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విషాదంగా విహారయాత్ర

జమ్ముకాశ్మీర్‌లో రోడ్డు ప్రమాదం • పత్తికొండ యువకుడి మృతి


ఆనంద్ రెడ్డి(ఫైల్)

పత్తికొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళికి యూనివర్సిటీలో సెలవులు రావడంతో స్నేహితులతో కలిసి కారులో జమ్ముకశ్మీర్‌కు విహారయాత్రకు వెళ్లిన పత్తికొండకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పత్తికొండ పట్టణానికి చెందిన ప్రతాప్ రెడ్డి, అనిత దంపతుల పెద్ద కుమారుడు వెంకట్ ఆనంద్ రెడ్డి(20) పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్(ఎల్పీ) యూనివర్సిటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి సెలవులు రావడంతో మరో ఆరుగురు స్నేహితులతో కలసి కారులో మూడు రోజుల క్రితం జమ్ము కాశ్మీర్‌కు విహారయాత్రకు వెళ్లారు. కారులో ముగ్గురు విద్యార్థులు, నలుగురు విద్యార్థినులు ఉన్నారు. అయితే బుధవారం ఉదయం 6 గంటల సమయంలో అనంత్‌నాగ్ ప్రాంతంలో యువకులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో పత్తికొండకు చెందిన వెంకట్ ఆనంద్ రెడ్డితో పాటు మరో విద్యార్థి మృతి చెందగా, మిగిలిన వారు గాయాల పాలయ్యారు. యువకుడి తండ్రికి అనంత్‌నాగ్ పోలీసులు సాయంత్రం ప్రమాద వివరాలను తెలియజేశారు. దీంతో యువకుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి విమానంలో జమ్ము కాశ్మీర్‌కు వెళ్లారు. కాగా మృతిచెందిన యువకుడి తండ్రి ప్రతాప్‌రెడ్డి పత్తికొండ మార్కెట్ యార్డ్ మాజీచైర్మన్, టీడీపీ నాయకులు ప్రమోద్ కుమార్‌రెడ్డికి స్వయానా మేనల్లుడు.

విద్యాప్రేరణపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేవీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులకు విద్యా ప్రేరణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లీనికల్ హిప్నోథెరపిస్టు డా.శిరిగిరెడ్డి జయారెడ్డి హాజరై విద్యార్థులకు విద్యా ప్రేరణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శిరిగిరెడ్డి జయారెడ్డి మాట్లాడుతూ విద్యాప్రేరణతో ఎన్నో సమస్యలను అధికమించి చదువుతోపాటు జీవితంలో సక్సెస్ సాధించవచ్చన్నారు. ఈసందర్భంగా పాఠశాల యజమాన్యం డాక్టర్ జయారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, కో-ఆర్డినేటర్ జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను వినియోగించుకోండి

కర్నూలురూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నిర్వహించే శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని ఆర్టీసీ కేంద్ర కార్యాలయ చీఫ్ మెకానికల్ (ఆపరేషన్) ఇంజనీర్ విజయరత్నం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక బళ్ళారి చౌరస్తా సమీపంలో ఉన్న ఆర్టీసీ జోనల్ స్థాయి శిక్షణ కళాశా లలో బుధవారం కర్నూలు, నంద్యాల డిపో మేనేజర్లు, మెకానికల్, సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కడప జోన్ ఈడీ సుమంత్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా విజయరత్నం పాల్గొని ప్రసంగించారు. టెక్నికల్ ఆడిట్ శిక్షణ తరగతులను నిర్వహించి పలు సందేహాలను నివృత్తి చేయాలన్నారు. కర్నూలు, నంద్యాల, జిల్లా ప్రజా రవాణా అధికారులు శ్రీనివాసులు, రజియా సుల్తానా, కర్నూ లు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ హరి నాథ్‌బాబు, డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుస్సేన్, మెకానికల్ ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

కల్లూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని తన స్వగృహంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రభా కర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పీయూ.మాదన్న, జనార్ధన్ ఆచారి, శైలజా యాదవ్ పాల్గొన్నారు.

ఆక్రమణకు గురికారాదు: జేసీ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నీటి పరివాహక ప్రాంతాలు ఎట్టి పరిస్థితుల్లో ఆక్రమణకు గురికారాదని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, సర్వే అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. కర్నూలులో హంద్రీనది పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు జరిగాయని, వాటిని గుర్తించడానికి ఆయా శాఖల అధికారులు ఐదు టీములు ఏర్పాటు చేసుకుని ఆక్రమణలకు గురైన వారికి సెక్షన్-7 కింద నోటీసులు అందజేయాలని ఆదేశించారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీవో సందీప్ కుమార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన నూతన కార్యవర్గం ప్రతినిధులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో ధార్మికవేత్త కళ్లే వేణుగోపాల్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొని ప్రమాణ స్వీకారం చేశారు. నగర బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడిగా చెరువు దుర్గాప్రసాద్, అధ్యక్షుడిగా సందేల్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా చల్లా నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడిగా కంచుగంటల శ్యామసుందర్ శర్మ, ఉప కార్యదర్శిగా నాగులవరం రాజశేఖర్‌రావు, వీరితో పాటూ మహిళా విభాగం, ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు 35 మంది ప్రమాణం చేశారు.

దుకాణాలపైకి దూసుకపోయిన ట్యాంకర్

మహిళ వ్యాపారికి తీవ్రగాయాలు



దుకాణాలపైకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్

కోడుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ ఆయిల్ ట్యాంకర్ బుధవారం ఉదయం బీభత్సవం సృష్టించింది. ఎమ్మిగనూరుకు చెందిన ట్యాంకర్ స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని ఒక దుకాణంలో ఆయిల్‌ను దిగుమతి చేసి ప్రధాన రహదారిపై వెళ్తుండగా ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ట్యాంకర్ డ్రైవర్ బ్రేక్ వేశాడు. అయితే బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో దుకాణాలపైకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన వ్యాపారస్తులు, ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. టెంకాయల వ్యాపారి మల్లమ్మ అనే మహిళ పైకి లారీ దూసుకొచ్చింది. ఆ మహిళ చాకచక్యంగా లారీ మధ్యలో కూర్చోండి పోయింది. దాంతో రెండు చక్రాల మధ్యలో ఉన్న మహిళను పది అడుగుల వరకు ట్యాంకర్ ఈడ్చుకెళ్లింది. పోలీసుస్టేషన్ దగ్గర ఉన్న గోడకు లారీ ఢీకొని నిలబడింది. మహిళ వ్యాపారికి తీవ్రగాయాలతో బయట పడ్డారు. మల్లమ్మను గ్రామపెద్దలు ఎద్దుల మహేశ్వరరెడ్డి పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సులకు మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టినరసమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ ఫేజ్‌లో కౌన్సెలింగ్‌లు పూర్తికాగా మిగిలిన ఆరు సీట్లకు కొత్త విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇంటర్ బైపీసీ విద్యార్హత కలిగి, రోస్టర్ కేటగిరికి చెందిన విద్యార్థులు మాత్రమే రూ.100లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నవంబరు 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 8న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. డార్క్‌రూం అసిస్టెంట్‌కు బీసీ(డీ)కి ఒకటి, బీసీ(ఏ)కి ఒక సీటు, డీఎంఐటీ కోర్సులో ఎస్టీకి ఒకటి, అనస్థీషియా కోర్సులో బీసీ-సీకి ఒకటి, బీసీ (డీ)కి ఒకటి, డీఎంఎల్‌టీ కోర్సులో బీసీ-సికి ఒక సీటు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్‌యూలో టీడీపీ నాయకుడి హల్‌చల్



- ఓ ప్రొఫెసర్‌కు పోస్టింగ్ ఇవ్వాలంటూ హడావుడి
- పలు విభాగాల్లో సీఎం సన్నిహితుడినంటూ పరిచయం
- ఏమి జరిగినా తనకు సమాచారం ఇవ్వాలంటూ హుకుం

కర్నూలు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో పది రోజులుగా ఓ టీడీపీ నాయకుడు హల్‌చల్ చేస్తున్నాడు. తాను సీఎం సన్నిహితుడినంటూ పలు విభాగాల్లో హడావుడి చేస్తున్నాడు. మంగళవారం శ్రీ క్రిష్ణ దేవరాయ యూనివర్సిటీలో పని చేస్తున్న ఓ ప్రొఫెసర్‌ను తీసుకెళ్లి డిప్యుటేషన్‌పై పోస్టింగ్ ఇవ్వాలంటూ ఇన్‌చార్జి వీసీ ఎన్‌టీకే నాయక్‌ను కోరారు. తాను ఇన్‌చార్జిని మాత్రమేనని, రెగ్యులర్ వీసీ వచ్చాక పరిశీలిస్తారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తాను అధికార పార్టీ కీలక నాయకుడి ఆదేశాలతో వచ్చానని, తన మాటకు విలువ ఇవ్వాల్సిందేనంటూ చాంబర్‌లో బెదిరింపులకు దిగినట్లు సమాచారం. పక్కనే ఉన్న రిజిస్ట్రార్ జోక్యం చేసుకొని పద్ధతి ప్రకారం ప్రక్రియ కొనసాగుతుందని చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి వర్సిటీలోని పలు విభాగాల్లోకి వెళ్లి తాను సీఎం సన్నిహితుడినని, క్యాంపస్‌లో ఏం జరిగినా తన దృష్టికి తీసుకురావాలని కొందరు ప్రొఫె సర్లకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఆయన వ్యవహార శైలిపై ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. ఈ విషయంపై రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడును వివరణ కోరగా క్యాంపస్‌లోకి ఓ నాయకుడు వచ్చిన మాట వాస్తవమేనన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

కోడుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జీవీఆర్ జడ్పీ హైస్కూ ల్లో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ధరలకు అనుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని, తల్లికి వందనం పథ కాన్ని అమలు చేసి రూ.15వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, అల్తాఫ్ పాల్గొన్నారు.

సభ్యత్వాల్లో మొదటి స్థానంలో నిలుస్తాం: తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి జిల్లాలో పార్టీ తీరును, సమస్యలను వివరించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజల్లో మంచి స్పందన కనిపిస్తోందని అన్నారు.

కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థినులకు షీల్డ్ అందజేస్తున్న డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగర శివారు దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఫ్రెషర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ ఎస్ విజయలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ జె.కన్నాకుమార్, నాక్ కన్వీనర్ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా రామేశ్వరరెడ్డి



సి.బెళగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా రామేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం పోలకల్లు గ్రామంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామేశ్వరరెడ్డిని రైతులు అభినందించారు. ఈసందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ రామేశ్వరరెడ్డి కోడుమూరు సబ్ డివిజన్‌లో 30 సంవత్సరాలుగా ఇరిగేషన్‌లో పనిచేసి పదవీ విరమణ పొందారన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, గోవిందు, రామకృష్ణ, వెంకటరెడ్డి, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి తీసుకోవాలి

మద్దికెర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీపావళి బాణసంచా విక్రేతలు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ విజయకుమార్ నాయక్ సూచించారు. బుధవారం మాట్లాడుతూ పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణాలు కాల్చాలన్నారు. చిన్న పిల్లలను విక్రయాల షాపు వద్దకు అనుమతించరాదన్నారు.

'యురేనియం తవ్వకాలు వద్దు'



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

దేవనకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో యురేనియం తవ్వకాలు జరపవద్దని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మండల కార్యదర్శి నర్సారావ్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే పర్యావరణం దెబ్బతిని కాలుష్యంతో ప్రజలు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తవ్వకాల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం డీటీ సుదర్శనంకు వినతిపత్రం ఇచ్చారు. కండప్ప, తిమ్మప్ప, శేఖర్ పాల్గొన్నారు.

తవ్వకాలకు వ్యతిరేకంగా ముందుకెళ్లాలి..

కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ముందుకు వెళ్లాలని పి.కోటకొండ గ్రామస్థులు తీర్మానించుకున్నారు. ఈ మేరకు బుధవారం సమావేశమయ్యారు. అడ్డుకునేందుకు పోరాట సమితిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హనుమంతు రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, అలంకోండ వెంకటేశ్వర్లు, వల్లె వెంకటేశ్వర్లు, చిట్యాల రామాంజనేయులు, వై.వెంకటేష్, యంకృష్ణమూర్తి పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నివారించాలి

- లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలను ఉపేక్షించొద్దు
- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షకు కారణమవుతున్న భ్రూణ హత్యల నివారణకు కృషిచేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పీసీ పీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించవచ్చన్నారు. ఈ మేరకు అవగాహన కలిగించాలని కోరారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమిస్తే రూ.50వేలు జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. స్కానింగ్ కేంద్రాల అక్రమాలపై ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు బహుమతి ఇస్తామన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో 48 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా ఐదు కేంద్రాలు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా ఉన్నతాధికారులకు నివేదించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు స్కానింగ్ కేంద్రాలను మూడు నెలలకోసారి తనిఖీచేయాలని, నిబంధనలను విరుద్ధంగా వ్యవహరిస్తే అనుమతి రద్దుచేయాలని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, జిల్లా నోడల్ అధికారి డా నాగప్రసాద్, చిన్నపిల్లల వైద్యులు పరిమళ, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ అధికారి సుమలత, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవోలు రాజేంద్ర శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్లు విస్తరించాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రహదారులను వెడల్పు చేసి, డ్రైనేజీ నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో డా.భరత్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బ్రిటీష్ హయాంలో నిర్మించిన రోడ్లే ఉన్నాయన్నారు గురుదాస్, పెద్ద వీరన్న, రామన్న, వెంకట్రాముడు, కాశీ, ధృవమూర్తి, నరసింహులు పాల్గొన్నారు.

పోటీల్లో తృతీయ స్థానం

ఆస్పరి, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్ 17 క్రీడా పోటీలలో జోహరాపురం విద్యార్థి సాయికుమార్ తృతీయ స్థానంలో నిలిచాడు. పీడీ మహేంద్ర బుధవారం విద్యార్థిని అభినందించారు. మున్ముందు మరింత రాణించాలన్నారు.

పేలుతున్న ధరలు

- టపాసులు కొనేందుకు బెంబేలెత్తుతున్న ప్రజలు



ఆదోనిలో బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆదోని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టపాసుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు కొనేందుకు బెంబేలెత్తుతున్నారు. కనీసం 30శాతానికి పైనే ధరలు పెరిగినట్లు వాపోతున్నారు. ఏ టపాసు కొందామన్న రూ.వంద పైనే ఉందని, రూ.వెయ్యి తీసుకెళ్లినా చిన్న బ్యాగ్ కూడా నిండడం లేదంటున్నారు.

గతేడాది, ఈ ఏడాది ధరలు ఇలా..,

కాకర పువ్వొత్తుల ధర గతేడాది రూ.60 ఉండగా, ఈ ఏడాది రూ.90నుంచి రూ.110ల వరకు చిచ్చుబుడ్లు చిన్నవి పది ఉండే బాక్స్ రూ.60ల నుంచి రూ.80లు ఉండగా, గతేడాది రూ.40 నుంచి 60 మధ్య ఉండేది. పెద్ద బాక్స్ రూ.300వరకు పలుకుతోంది. తాళ్ల చిన్న పెట్టె రూ.40, పెద్దవి రూ.80, సీమటపాసులు చిన్నది బాక్స్ రూ.50లు పలుకుతోంది. భూ చక్రాలు గతేడాది రూ.70నుంచి రూ.80 ఉండగా, ఇప్పుడు రూ.100 నుంచి 120 దాకా పెరిగింది. 5000వాలా బాంబు దండ గతంలో రూ.1,200లు నుంచి రూ.1300లు ఉండేది, ఇప్పుడది ఏకంగా రూ.1,800 ల వరకు పలుకుతోంది 10 వాలా మంచి రకం గతంలో రూ.2వేలు ఉండేది ఇప్పుడు రూ.2500 ఉంది.

కౌన్సిల్ సమావేశం రసాభాస

- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల మధ్య వాగ్వాదం



చైర్మన్ పోడియం వద్ద బైఠాయించిన కౌన్సిలర్లు

ఆదోని టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. చైర్‌పర్సన్ శాంత వాల్మీకి అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ నరసింహులు తీవ్ర వాదోపవాదాలు చేసుకోవడంతో గందరగోళంగా మారింది. వైస్ చైర్మన్‌కు వేసే చైర్ విషయంలో ప్రారంభమైన మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరిది. మునిసిపల్ యాక్టు ప్రకారం సీట్లను వేస్తున్నట్లు కమిషనర్ కృష్ణ సమాధానం ఇచ్చారు. గతంలో స్వచ్ఛ భారత్ కింద మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కౌన్సిలర్లు సురేష్, లలితమ్మ, పద్మావతి ప్ల కార్డులతో చైర్మన్ పోడియం ముందు బైఠాయించారు. గతంలోనే ఈ విచారణ జరిగిందని గత ప్రభుత్వ హయాంలో జరిగిన దానిపై ఇప్పుడు చర్చిం చడం సరికాదని వైస్ చైర్మన్ నరసింహులు వాదించారు. పాత బస్టాండ్‌లో నిర్మిస్తున్న కాంప్లెక్స్ పనులు ఆగిపోవడంతో డబ్బులు చెల్లించిన వారు ఆందోళన చెందుతున్నారని, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి పనులు కొనసాగేలా 30 మంది కౌన్సిలర్లు మెమో రాండం ఇచ్చినా సమాధానం లేకపోవడంపై వైస్ చైర్మన్ నరసింహులు వాగ్వాదానికి దిగారు. సమాధానం రాకపోవడంతో వైసీపీ కౌన్సిలర్లు బాయ్‌కాట్ చేయడంతో సమావేశం వాయిదా పడింది. ఎంఈ ఇంతియాజ్ ఆలీ, డీఈ రామమూర్తి, ఏసీసీ కృష్ణసింగ్, ఆర్‌వో అస్లాం పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



భార్గవ్(ఫైల్)

ఆదోని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన బి.భార్గవ్(18) బుధవారం తెల్లవారు జామున రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వర రావు తెలిసిన మేరకు.. కొన్ని రోజులుగా భార్గవ్ గుండెనొప్పితో ఇబ్బంది గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున గుండె నొప్పి రావడంతో ఆదోని-ఇస్వీ స్టేషన్ల 497/ 19-20 కిమీ మధ్య భార్గవ్ ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



పీఎం రెడ్డి(ఫైల్)

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ పీఎం రెడ్డి (405880) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాల మేరకు.. మెలిగనూరు నైట్ డ్యూటీకి వెళ్లి ఉదయం డ్యూటీ దిగి రూముకు వెళ్లాడు, గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం ఆత్మకూరు మండలం వెంకటాపురం. ఆరేళ్లుగా ఆదోనిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈయూ నాయకులు రంగస్వామి ఉలిగప్ప, లక్ష్మణ, ఎస్‌వీ కుమార్, సుధాకర్ సంతాపం తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద తుంబళం జడ్పీ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశులు, పీఈటీ రమేష్ తెలిపారు. బుధవారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. హరికృష్ణ అండర్ 17 రాష్ట్ర కబడ్డీ జట్టుకు, షాహిద్ అండర్ 17 ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

వాలీబాల్‌కు గురుకుల విద్యార్థిని ఐశమ్మ



ఆలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గురుకుల (బాలికల) పాఠశాల 8వ తరగతి విద్యార్థిని పెద్దింటి ఐశమ్మ రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ షాహినూర్ బుధవారం తెలిపారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థి నవంబర్ 2 నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపికైందన్నారు. ఉపాధ్యాయులు రంగబాబు, మల్లికార్జున, రమాదేవి, విజయకుమార్, రాజేంద్ర అభినందించారు.

సభ్యత్వ నమోదుకు భారీ స్పందన



సభ్యత్వం ఇస్తున్న టీడీపీ నాయకుడు ఉమాపతినాయుడు

ఆదోని, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు భారీ స్పందన వస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. బుధవారం నాగనాథనహల్లిలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. రంగస్వామి నాయుడు, రామస్వామి, సుబ్బారెడ్డి, విశ్వనాథ్ గౌడ్, నరసప్ప, నాగరాజ్, రామకృష్ణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రూ.వందతో ఐదులక్షల బీమా

రూ.వంద కడితే రూ. రూ.5లక్షలు బీమా వర్తిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం పేర్కొన్నారు. గురువారం పరసమోహల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

తుగ్గలి: సభ్యత్వం తీసుకుంటే పార్టీ అండగా ఉంటుందని టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ మసాల శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాంకొండలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. రూ.వందలో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల భీమా ఉంటుందని, రెండేళ్లపాటు సభ్యత్వం ఉంటుందన్నారు. డా.చంద్ర ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాగిణి

మద్దికెర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వసతి గహ విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యాధికారి రాగిణి సూచించారు. బుధవారం కస్తూర్బా పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతి 20 మంది కిశోర బాలికల్లో ఒకరు డిప్రెషన్‌కు గురవుతున్నారని, 15 నుంచి 24 సంవత్సరాలలోపు వారు ఆత్మహత్యకు పాల్పడుతున్నాన్నారు. యోగా, సమయానికి నిద్రపోవడం, పౌష్టికాహారం తీసుకోవడం, మంచి సామాజిక సంబంధాలు కలిగి ఉంటే దీనిని తప్పించుకోవచ్చని అన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సీహెచ్‌వో నిరంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందవరం, అక్టోబరు 30(ఆంధ్యజ్యోతి): కనకవీడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచారని హెచ్ఎం గౌరమ్మ తెలిపారు. అండర్ 17 విభాగంలో రవీంద్ర, అనసూయ, రూప, అండర్ 14 లో ప్రకాష్, శిరీషశారద ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

డోన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రహదారిలోని క్లబ్ హౌస్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసుల అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు ఆధ్వర్యంలో యువకులు భారీగా తరలివచ్చి రక్తదానం చేశారు. అదే విధంగా డీఎస్పీ, సీఐలతో పలువురు పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. దాదాపు 200 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, డోన్‌నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్డె మహారాజ్, టీడీపీ నాయకులు కేశన్నగౌడు, ఎర్రగుంట్లపల్లి రమేష్‌రెడ్డి, సుధీష్, ఓంప్రకాష్, ఆలేబాదు పరమేష్, వలసల బాలుడు, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రసాభాస

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం

ఎమ్మిగనూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పురపాలక సంఘం సమావేశం రసాభాస మధ్య అర్థాంతరంగా ముగిసింది. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్మన్ డా. రఘు అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన అజెండాలోని అంశాలను చదువుతుండగా వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ ఆమోదిస్తున్నామని చెప్పారు. అనంతరం ఆరో వార్డు వైసీపీ కౌన్సిలర్ శివప్రసాద్ మాట్లాడారు. శివన్న నగర్‌లో రోడ్డు వేసేందుకు సతీష్ అనే కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడని, ఆయన పనులు సక్రమంగా చేయడం లేదని, గతంలో ఫిర్యాదు చేశామని, తిరిగి ఆయనకు టెండర్ ఎలా ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టి, పనులు ఇవ్వారాదని కోరారు. అలాగే వీవర్స్ కాలనీ గౌండ్ దగ్గర కూరగాయల డబ్బాలను పెట్టరాదని గతంలో ఆందోళన చేసిన టీడీపీ నాయకులు నేడు ఎందుకు తొలగించడం లేదంటూ నిలదీశారు. కొంత మంది సభ్యులు సొంత అభివృద్ధి కోసమే టీడీపీలో చేరారని, సిగ్గులేకుండా పార్టీలు మారారని ఘాటుగా వ్యాఖ్యానించారు. దీంతో టీడీపీ సభ్యులు దయాసాగర్, రామదాసు గౌడ్, అమాన్, ఇసాక్, వాహీద్‌లు.. శివప్రసాద్‌పై ఎదురుదాడికి దిగారు. మీరు పార్టీలు మారలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువురు సభ్యులు శాంతించాలని చైర్మన్ డా రఘు కోరినా సభ్యులు పట్టించుకోకపోవటంతో బెల్ కొట్టి సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు. అనంతరం టీడీపీ సభ్యులు వైసీపీ సభ్యుడు శివప్రసాద్ వ్యాఖ్యలను నిరసిస్తూ కార్యాలయం మెట్లపై బైఠాయించారు. శివప్రసాద్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వైసీపీ సభ్యుడు శివప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. వైస్ చైర్మన్ దివ్వకళ మాట్లాడుతూ పట్టణంలోని కలుగొట్ల రోడ్డులో ఎంబీ చర్చి నుంచి కబరస్తాన్ కొట్టాల వరకు రోడ్డు వేసేందుకు గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయన్నారు. నేడు 60 శాతం మాత్రమే రోడ్డు వేస్తున్నారని, ఎందుకు ఇలా చేస్తున్నారో.. చెప్పాలన్నారు. అలాగే మృతిచెందిన కార్మికుల కుటుంబీకులకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ గంగిరెడ్డి స్పందిస్తూ మిగతారోడ్డు పనులు చేసేందుకు జనరల్ ఫండ్ నుంచి నిధులు కేటాయిస్తున్నామని, అలాగే ఉద్యోగాలు ఇచ్చే విషయం ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న టీడీపీ, వైసీపీ సభ్యులు

పార్టీ సభ్యత్వం కార్యకర్తకు భరోసా


సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

కౌతాళం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని, కార్యకర్త క్షేమమే పార్టీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్యాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప నివాసంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ టీడీపీ నాయకులు కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. కాగా, మండల పరిధిలోని బదినేహాల్ గ్రామానికి చెందిన 30 మంది వైసీపీ కార్యకర్తలు బుధవా రం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వచ్చిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, నాయకులు రమేష్‌గౌడ్, బాపురం వెంకటరెడ్డి, ఉరుకుంద కురుగోడు, కుంటనహల్ దొడ్డనగౌడ్, రాజబాబు, సిద్దు, నాగరాజుగౌడ్, శివప్పగౌడ్, మాదిగ మల్లి కార్జున, నాగేష్, అయ్యప్ప, మాలాజీ ముకప్ప పాల్గొన్నారు.

'నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి'

కౌతాళం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికలో పనులు చేసే కాటికాపర్లను ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తిం చాలని బేగరుల సంఘం (కేజీబీఎస్) మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బేగరుల సం ఘం (కేజీబీఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ మండలంలో ఎవరైన మృతి చెం దితే శవాలకు గుంతలు తీసి వాటిని పూడ్చిపెట్టడం తమ విధి అని, మృతుల సంబంధికులు ఇచ్చిన నగదుతోనే కుటుంబాలను పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి పథకాలు అందడం లేదని తెలిపారు. ప్రభుత్వాలు కాటికాపర్లకు ఉద్యోగ భద్రత కల్పించి తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో సుబ్బరాజుకి వినతి పత్రం అందజే శారు. కార్యక్రమంలో కాటికార్ల సంఘం మండల నాయకులు వీరేష్, జయరాం, బసవ, ఈరన్న, నాగరాజు, ఎల్లప్ప, చంద్రప్ప, మహానంది, మహదేవ, లూథర్ పాల్గొన్నారు.

'ఉపాధి' నిధుల మంజూరు

నందవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలానికి రూ. 20 కోట్లు మంజూరైయ్యాయని ఎంపీ డీవో పుల్లయ్య తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని వైస్ ఎంపీపీ పేట నడిపి షేక్ సాబ్ అధ్యక్షతన నిర్వహించారు. ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి కూలీలు వలసలు వెళ్లకుండా నివారించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లుతో పాటు వివిద అభివృద్ధి పనులకు ఉపాధి నిధులు ఉపయోగపడుతాయన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ సందీప్, ఏఈలు మణికంఠ, ప్రేమ్‌కుమార్, నరసింహులు, ఏవో స్రవంతి, ఏపీఎం రాఘవేంద్ర, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలోని కర్ణాటకలోని బిచ్చాలి మాంతేష్ స్వామి పీఠాధిపతి శివాచారిస్వామి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ సత్యనారాయణలను కలిశారు. బుధవారం అమరావతిలో టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి, కమిషనర్‌ను కలిసి శాలువ, మెమెంటో, ప్రసాదం, మెమెంటో, రుద్రాక్షమాలను ఇచ్చి పీఠాధిపతి ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మాంతేష్ స్వామి మఠాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు తిక్కారెడ్డి తెలిపారు.

బైక్ దొంగలు అరెస్ట్

కౌతాళం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జల్సాలు, విలాసాలకు అలవాటుపడిన ఇద్దరు వ్యక్తులు బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరకడంతో ప్రస్తుతం జైలులో ఊచలు లెక్కిస్తున్నారు. కౌతాళం ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపిన వివరాల మేరకు.. కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన వన్నూర్ బాష, మల్లికార్జున పోలీసులను చేసి పారిపోయారు. అనుమానం వచ్చిన పోలీసులు పట్టుకుని తమదైన శైలిలో విచారించారు. దాంతో పలు చోట్ల బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. దొంగలించిన బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని వారిని ఆదోని కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ జల్సాలకు బానిసలై తప్పుడు మార్గంలో నడిచి దొంగతనాలకు అలవాటు పడిన ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సోమ్లా నాయక్, కానిస్టేబుళ్లు మద్దిలేటి, వీరాంజనేయులు, నారాయణ, శివ నాయక్, వీర భాస్కర్, మోహన్‌రాజు ఉన్నారు.